## స్పందనతోనే సత్వర న్యాయం : జిల్లా ఎస్పీ

### విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం..



**కర్నూలు క్రైమ్, మే, 29, ప్రభాతవార్త :** స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి సోమవారం మొత్తం 71 ఫర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని నా ప్రమేయం లేకుండా వేలిముద్రలతో ఆధార్ ఏఈపిఎస్ ద్వారా నా ఖాతా నుండి తెలియనా వ్యక్తులు నగదును డ్రా చేసుకున్నారని కర్నూలుకు చెందిన రిటైర్డు లెక్చరర్ కె వెంకటరమణ ఫిర్యాదు చేశారు. బతుకు తెరువు కోసం మేము హైదారాబాద్ కు సిమెంట్ పనికి వెళిప మా పొలాలను మా తమ్ముడు అమ్మి వేశాడని దైవం దిన్నె గ్రామానికి చెందిన మునిస్వామి బజారి ఫిర్యాదు చేశారు. ఉద్యోగం చేయడం లేదని నా భర్త ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు కు చెందిన సుమలత ఫిర్యాదు చేశారు. నా పోలానికి రస్తా ఇప్పించి న్యాయం చేయాలని కంబదహాల్ గ్రామానికి చెందిన చిన్న మల్లయ్య ఫిర్యాదు చేశారు. నా భర్త చని పోయిన తర్వామామ ఇంటి నుండి బయటకు పంపించారని భర్త ఆస్తి ఇవ్వడం లేదని కర్నూలు చెందిన జ్యోతి ఫిర్యాదు చేశారు. నా పోలాన్ని అమ్మనివ్వడం లేదు విత్తనం వేయనివ్వడం లేదని న్యాయం చేయాలని పత్తికోండ కు చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వజైర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గోన్నారు.

## నా బిడ్డకు సరైన చికిత్సఇవ్వకుండా చంపేశారు..!

- తేలు కాటుకు గురై ఆస్పత్రికి వచ్చిన బాలుడిని నిర్లక్ష్యం చేసిన వైద్యులు
- బాలుడి మృతితో ఆస్పత్రి వద్ద బాలుడి తల్లిదండ్రుల రోదనలు
- వైద్యులను నిలదీసిన జయమనోజ్‌రెడ్డి
- విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం ; జయమనోజ్‌రెడ్డి

**ఆదోనిటౌన్, మే29, ప్రభాతవార్త ;** హాలిగేర గ్రామానికి చెందిన భరత్(08) అనే బాలుడు ఆదివారం రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లి దండ్రులు పొలంలో పనిచేస్తున్న సమయంలో బాలుడికి తేలుకుట్టగా మెరుగైన వైద్యం కోసం ఆదివారం సాయంత్రం ఆదోని ఏరియా ఆస్పత్రికి చికిత్సకై తీసుకొచ్చారు. ఆస్పత్రికి వచ్చిన ప్పటి నుంచి వైద్యులు మా అబ్బాయిని పట్టించుకోక పోగా బూతులు మాట్లాడి మాపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బాలుడి తల్లిదండ్రులు వాపోయారు. అర్ధరాత్రి సమయంలో బాబుకు ఆరోగ్యం మరింత విషమంగా మారడంతో డాక్టర్లు ఒక్కరు కూడా సహకరించలేదని ఉదయం 8 గంటల ప్రాంతంలో మా బిడ్డ చనిపోయాడు అని తల్లిదండ్రులు వాపోయారు. వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరించి చంపేశారంటూ వైద్యుల తీరుపై మండిపడ్డారు. కొడుకు కాలం చేశాడని గుండెలు బాదుకుంటూ రోదనలతో ఆస్పత్రి ప్రాంగణంలో బాలుడు తల్లిదండ్రులు కన్నీంటి పర్యంతమయ్యారు. గేటు బయట పార్టీ కార్యక్రమంలో ఉన్న వైఎస్సార్సీపీ యువనాయకుడు మనోజ్‌రెడ్డిబాధితుల సాదక బాధలు తెలుసుకుని, వైద్యులను ప్రశ్నించారు. చేతగాకపోతే విధుల నుంచి తప్పుకోవాలని, వైద్యులపై మండిపడ్డారు. ఇదిలా ఉండగా ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేసే డాక్టర్లో దాదాపుగా ఆదోనిలో ప్రయివేట్ క్లీనిక్‌లు నడుపుతున్నారని, అక్కడ ధనార్జనకు అలవాటు పడ్డ వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రిలో విధుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నా ఏ ఒక్కరు వైద్యులపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై సమగ్రవిచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఇలాంటి పునరావృతంగాకుండా చర్యలు తీసుకుంటామని జయమనోజ్‌రెడ్డి చెప్పారు.



## "జగనన్నకు చెబుదాం" అర్జీలను నాణ్యతతో పరిష్కరించండి



**కర్నూలు, మే 29, ప్రభాతవార్త :** జగనన్నకు చెబుదాంకు సంబంధించి అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు మరియు మండలాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలకు సంబంధించి ఇంకా చూడని ఫిర్యాదులు ఉండకుండా చూడలన్నారు. జగనన్నకు చెబుదాంకు సంబంధించి రీఓపెన్ అయిన అర్జీలను అధికారులంతా ఈరోజు పరిశీలించి సరైన ఎండార్స్మెంట్ ఇచ్చి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటన కొన్ని అనివార్య కారణాల వల్ల జూన్ 1వ తేదికి వాయిదా పడిందని ఈ సమయాన్ని అధికారులు అందరూ సద్వినియోగం చేసుకొని రేపు సాయంత్రం నాటికి పూర్తి స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐసిడిఎస్ సిబ్బంది సభా ప్రాంగణ సుందరీకరణ, ఆర్ అండ్ బీ శాఖ రోడ్స్, ఆర్చీలు, హెలిప్యాడ్ వద్ద పార్కింగ్, సభా ప్రాంగణం వద్ద బ్యారికేడింగ్, డిపిఓ పారిశుధ్యం, పిఓ ఎస్ఎస్ఏ సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు వారికి కేటాయించిన విధులలో ఎటువంటి ఆలసత్వం లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సరిహద్దు రాళ్లకు సంబంధించి పెండింగ్ ఉన్న గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ 4జీ టవర్స్ ఏర్పాటు చేయడానికి గాను రెండు వేల చ.అడుగుల స్థల సేకరణ చేయాల్సి ఉందని, అందుకు గాను పెండింగ్ ఉన్న మండలాల తహశీల్దార్లు త్వరితగతిన స్థలాలు గుర్తించి బిఎస్ఎన్ఎల్ అధికారులకు సంబంధిత స్థలాన్ని అందజేసి అందుకు తగిన నకలు కాపీని కలెక్టర్ కార్యాలయానికి పంపాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమఠంలో ఘనంగా శ్రీ వాదీంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు



**మంత్రాలయం, మే 29, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతులైన శ్రీ వాదీంద్ర తీర్థుల273వ ఆరాధన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ వేడేకల్లో భాగంగా శ్రీ వాదీంద్ర తీర్థుల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాదీంద్ర తీర్థుల బృందావనానికి మహా అభిషేకం చేశారు. వాదీంద్రతీర్థులకు శ్రీమఠం ప్రాకారంలో అశేష భక్తుల మధ్య ప్రాథకాల రథోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో భజన మండలి భక్తులు, శ్రీమఠం అధికారులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు.

## గాలి..వాన బీభత్సం..!

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



**చాగలమర్రి, మే29, ప్రభాతవార్త:** చాగలమర్రి పట్టణంలో సోమవారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. సుమారు గంటపాటు వీచిన గాలివానకు చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడాయి. దీంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గతంలో ఎన్నడు లేని విధంగా భీకరమైన గాలులు వీచడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పట్టణంలోని నోబెల్‌హాల్ సమీపంలో పెద్ద వృక్షాలు సమీపంలో ఉన్న వాహనాల పై కూలాయి. అలాగే పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. స్థానిక కేరళ ఆసుపత్రిలో టెంకాయచెట్టు పై పిడుగు పడడంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్నా పేషేంట్లు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. పలు రహదారుల పై నీరు ప్రవహించింది.

## ఎమ్మెల్యే శిల్పా బైక్ ర్యాలీ



**ఆత్మకూరు, మే 29, ప్రభాతవార్త:** వై.యస్.ఆర్.సి.పి. ప్రభుత్వం ఏర్పడి నాలుగు ఏళ్ళు పూర్తి అయిన సంధర్భంగా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయం నుండి ఎమ్మెల్యే జై జగన్ అంటు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ చేసి వై.యస్.ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళీలు అర్పించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగ ఏళ్ళలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామాన్యులకు అధికారం.. కట్టబెట్టిన ఘనత.. వైసిపిదే..!

- బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన జగన్
- పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు :మంత్రి గుమ్మనూరు



**ఆలూరు, మే 29, ప్రభాతవార్త** సామాన్యులకు అధికారం కట్టబెట్టిన ఘనత..వైసిపి పార్టీదేనని..రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం పట్టణంలోని ఆలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం వారి సోదరులు దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామిలు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ముందుగా పట్టణంలో మంత్రి ఇంటి నుండి బస్టాండ్ మీదుగా వైకాపా నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీగా తరలివచ్చి ఇబ్రహీం ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌గా నారాయణతో పాటు పాలక వర్గ సభ్యులు పదిమందితో మంత్రి జయరాం, మార్కెట్‌యార్డు కార్యదర్శి శాంతకుమార్‌లు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ప్రజలను తన గుండెల్లో పెట్టి చూసుకుంటానని మాటిచ్చానని ఇచ్చిన మాట ప్రకారం తాలుకలోని సామాన్య కార్యకర్తలకు రాజ్యాధికారం కట్టబెట్టామన్నారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా పార్టీకి సేవ చేసిన వారిని గుర్తించి ఉన్నత స్థానంలో పదవులు ఇచ్చి చూసుకుంటామన్నారు. చిప్పగిరి మండల కని వ్వనర్‌గా పనిచేసిన నారాయణ వైకాపా పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారన్నారు. ఇకముందు కూడా నియోజకవర్గ ప్రజలకు ఆయన సేవలు ఎంతో అవసరమని గుర్తించి ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు కూడా పార్టీకి సేవ చేస్తున్నారని వారి సేవలను కూడా గుర్తించి రానున్న రోజుల్లో గుర్తింపు లభించే విధంగా కృషి చేస్తామన్నారు. అలాగే రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి పథకాలు వారికి అందుతున్నాయా..లేదా..అని విచారణ చేసి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలని తెలిపారు. సిఎం జగన్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి పదవులైనా సామాన్యులకే అందుతున్నాయని సామాన్యులకు రాజ్యాధికారం కట్టబెట్టిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంలకే దక్కుతుందన్నారు.

● వివరాలు 2లో

## డోన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా.. స్కిల్ హబ్

: రూ.2కోట్లతో కియా నాలెడ్జ్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ప్రారంభం
: మంత్రి బుగ్గన సమక్షంలో కియా-ఎపి ప్రభుత్వం ఒప్పందం
: స్కిల్ డెవలప్‌మెంట్‌లో రాష్ట్రానికే దిక్సూచీగా 'డోన్ హబ్'
: హాజరైన కియా ఎండి, కలెక్టర్, మంత్రి, పలువురు ఐఏఎస్‌లు
: శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఇక కొదవలేని ఉపాది ఉద్యోగం






**డోన్, మే 29, ప్రభాతవార్త** డోన్ ప్రాంత చరిత్రలో ఎప్పుడూలేని, ఎవరూ చేయలేని నిరుద్యోగ యువతకు ఉపాధిని, ఉద్యోగాలను కల్పించే ఎంతో విలువైన స్కిల్ నాలెడ్జ్‌హబ్ డోన్ కేంద్రంగా ఏర్పాటైంది. స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిగా ఉన్న ఆర్థికమంత్రి బుగ్గన రాజారెడ్డి కియాసంస్థతో పలు పర్యాయాలు చర్చించి చివరికి ఒప్పించిన అనంతరం ఆ పరిశ్రమ ఎపి ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకోవడం ఈ ప్రాజెక్టు డోన్‌లో ఏర్పాటుచేసేందుకు సుగమం అయ్యింది. సుమారు రూ.2కోట్ల వెచ్చించి కియా సంస్థ అత్యంత ఆధునిక పరికరాలతో యువతకు పారిశ్రామిక శిక్షణాసంస్థలో నైపుణ్యాభివృద్ధిని కల్పించి ఉద్యోగాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం డోన్‌లోని ఐటిఐలో ఏర్పాటు చేసిన కియా నాలెడ్జ్ ఎక్స్‌లెన్ సెంటర్ (స్కిల్ హబ్) రాష్ట్రంలోనే ప్రప్రథమం కావడం మరింత విశేషం. పైలెట్ ప్రాజెక్టుగా డోన్ కేంద్రంగా ఏర్పాటవుతున్న స్కిల్ హబ్ రాష్ట్రంలోని నైపుణ్యం నేర్చుకున్న నిరుద్యోగులకు చిరునామాగా మారనుండటంతో అతిశయోక్తిలేదు. ఎంతో ప్రాధాన్యతగల ఈ స్కిల్ హబ్‌ను ప్రారంభించేందుకు రాష్ట్ర అధికార యం త్రాంగం పలువురు ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, మంత్రి బుగ్గన, నంద్యాల జిల్లా కలెక్టర్‌లతోపాటు కియా సంస్థ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండి మరయిఉ సిఇఓ టీ జింగ్ పార్క్‌కూడా హాజరయ్యారు. పెద్దఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, కియా సంస్థ సిబ్బంది, ప్రజాప్రతినిదుల మధ్య పలు స్కిల్ డెవలప్‌మెంట్ నాలెడ్జ్ హబ్‌లను మంత్రి తోపాటు, కియా ఎండిలు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో స్కిల్ హబ్ గురించి వివరిస్తూ దీనివల్ల నిరుద్యోగ యువతకు ఎంతటి ఉపయోగం ఉంటుందో తెలిపారు.

**డోన్‌లో ఏర్పాటుకావడం ఓ చరిత్ర:** ఎంతో విలువైన, యువతకు ఉపయోగకరమైన స్కిల్ హబ్ డోన్‌లో ఏర్పాటు కావడం ఓ చరిత్రయని అది స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిగా ఉన్న బుగ్గనకే సాధ్యమైందంటూ కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌తోపాటు, ప్రిన్సిపల్ సెక్రటరీ ఐఏఎస్ నవీన్, ఉపాది అండ్ ఎంప్లాయిమెంట్ ఐఏస్ అధికారిని నవ్యలతోపాటు కియా సంస్థ ఎండి పార్క్ కొనియాడారు. ఆదునిక పరికరాలతోపాటు ఎక్స్‌లెన్సీ సర్టిఫికేట్‌ను అందజేసి తద్వారా ఉద్యోగ కల్పనను కియాసంస్థ కల్పిస్తులందని అంతకన్నా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఏం కావాలని అన్నారు. ఇది ఒక్క డోన్‌కే కాదని రాష్ట్ర యువత డోన్ వైపు చూస్తుందన్నారు. ఇది ఒక పైలెట్ ప్రాజెక్టుయని మొట్టమోదటిది ఇదేనని దీన్ని రాష్ట్రమంతటా అమలుచేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు.

**విద్యతోనే మార్పు..** సమాజంలోని మనిషికి ఎన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పించినా మార్పు జరగదని ఒక్క చదువుతోనే అది సాధ్యమని మంత్రి బుగ్గన అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే బేతంచెర్లలోని పాలిస్‌బండల ఫ్యాక్టరీలు, లారీల హమాలీలను చూసి ఆనాడే ఒక సంకల్పం కల్గిందని వర్షంమీద ఆదారపడి బ్రతుకుతున్న ఈ ప్రాంతానికి ఏమి చేయాలన్న ఆలోచనకు బీజం పడిందన్నారు. అప్పటి ఆలోచనలకు రూపం కల్పించడం నేడు తాను డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ పట్టణంలో వద్యకు కోట్లాది రూపాయలు ఖర్చుపెడ్తూ విద్యాసంస్థలను, నైపుణ్యాభిసంస్థలను తీసుకురావడానికి కారణమవుతుందన్నారు. కేవలం విద్యద్వారానే మార్పువస్తుందన్నారు. విద్య, చేతిలో పని (స్కిల్) వుంటే ప్రపంచాన్నే జయించవచ్చని అంటే ఎక్కడైనా దర్జాగా బ్రతకవచ్చన్న సిద్దాంతాన్ని నమ్ముకున్నానన్నారు. అందుకే ఏళ్ళతరబడి వృదాగా దేనికి పనికి రాకుండా పోతున్న డోన్‌లో ఐటిఐలో ఒక సమూల మార్పును చేసి డోన్ ఐటిఐ వైపు రాష్ట్ర యువతనే చూసేలా చేసానన్నారు. బేతంచెర్లలో పాలిటెక్నిక్, ప్యాపిలిలో షెపర్డ్ ట్రైనింగ్, డోన్‌లో రూ.40కోట్లతో బిసి బాలికల రెసిడెన్సియల్ స్కూల్ మరియు కాలేజీ, ఎస్‌సి బాలుర స్కూల్ కాలేజీకి మరో రూ.32కోట్లు కేటాయించామన్నారు. వాటికి పర్మినెంట్ భవనాలుకూడా నిర్మిస్తున్నామన్నారు. మంత్రి సమక్షంలో

**కియా-ఎపి ప్రభుత్వం ఒప్పందం:** రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా అత్యాదునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన కియా నాలెడ్జ్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌కు సంబందించి కియా సంస్థ ఎపి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయాన్ని ప్రారంభోత్సవ వేదికగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఐఏఎస్ అధికారులైన వినోద్‌కుమార్, నవ్య, శ్రీనివాసులు ప్రకటించారు. ఈ మేరకు మంత్రి సమక్షంలో ప్రభుత్వం, కియా పరిశ్రమ చేసుకున్న ఒప్పంద పత్రాలను వారు వేదికపై ప్రదర్శించారు. డోన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాని రాష్ట్రమంతటా ఈ నాలెడ్జ్ హబ్ విస్తరిస్తుందన్నారు. క్యూఆర్ కోడ్ సర్టిఫికేట్‌తో కియా సంస్థలోనే కాకుండా ఇక్కడ పొందిన నైపుణ్యంతో ఏ సంస్థలోఅయిన ఉద్యోగం పొందేందుకు అర్హతను సాదిస్తారని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్, నైపుణ్యాలకు ఎపిని చిరానామాగా తీర్చిదిద్దనున్నట్లు అధికారులతోపాటు మంత్రి బుగ్గన చెప్పారు.

● వివరాలు 2లో

## గతంలో పనిచేసిన ఆలయ ఈఓ ఆభరణాల లెక్క చెప్పాలి

**కర్నూలు రూరల్, మే 29, ప్రభాతవార్త :** గతంలో పనిచేసిన ఆలయ ఈఓ రామాంజనేయులు ఎల్లమ్మ అమ్మవారి ఆభరణాల లెక్క చెప్పాలని వెంకాయపల్లె ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు అన్నారు. సోమవారం ఆయన కార్యాలయం నందు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలోని వెంకాయపల్లె గ్రామసమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ ఈఓగా 2014కు ముందు ఆలయ ఈఓగా పనిచేసిన వాణి అసమయంలో కొత్తగా వచ్చిన ఆలయ ఈఓ రామాంజనేయులుకు అమ్మవారి బంగారు, వెండి ఆభరాలు లెక్కచెప్పి రిలీవ్ అయ్యారన్నారు. ఆమె తదనంతరం భాద్యతలు తీసుకున్న రామాంజనేయులు అమ్మవారి ఆభరణాలు దాదాపు కిలోకి పైగా బంగారు, 10కిలోలకు పైగా వెండి ఆభరణాలు తన 4సం॥6నెలల పదవికాలంలో తన తర్వాత ఆలయ ఈఓ శోభాకు కానీ ఆమె తర్వాత వచ్చిన ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి కానీ ఆయన తర్వాత ఈఓగా వచ్చిన సీతారామిరెడ్డిలకు ఎటువంటి లెక్కలు చూపలేదన్నారు. తను ఆలయ చైర్మన్‌గా పదవీ భాద్యతలు తీసుకున్న తర్వాత అప్పటి ఈఓ చంద్రశేఖర్‌రెడ్డిని అమ్మవారి బంగారు, వెండి ఆభరణాల గురించి లెక్క అడుగగా అదిగో చెబుతాను..ఇదిగో చెబుతాను..అంటూ ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిపోయారన్నారు. ఆయన స్థానంలో వచ్చిన ప్రస్తుత ఈఓ సీతారామిరెడ్డిని ఆభరణాల గురించి లెక్క అడుగగా గతంలో పనిచేసిన ఈఓలు బంగారు, వెండి ఆభరణాల గురించి తనకు లెక్క చెప్పనందున నేను గతంలో ఉన్న ఆభరణాలు మీకు చెప్పలేనని తెలిపారన్నారు. గతంలో పనిచేసిన ఆలయ ఈఓ రామాంజనేయులు ఇంతకాలం ఈ బంగారు, వెండి ఆభరణాలు ఎవరికి లెక్క చెప్పారు..ఈ ఆభరణాలు ఎక్కడ దాచారు..అనేది ప్రశ్నార్థకంగా ఉందని ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు అన్నారు. భక్తులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ, పై అధికారులు గతంలో పనిచేసిన రామాంజనేయులను విచారణ చేసి అమ్మవారి ఆభరణాలు స్వాధీనం చేసుకుంటారనే నమ్మకం తనకుందని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు కలుగచేసుకుని గతంలో పనిచేసిన ఈఓ నుండి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అమ్మవారి ఆభరణాల గురించి ప్రజలలో చెడ్డపేరు తీసుకురాకుండ వీలైనంత త్వరగా స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు.



## కొడుకులు రారని.. ఇంట్లోనే భర్తకు దహన సంస్కారాలు చేసిన భార్య..!

- తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులు
- ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తున్న కుమారులు

**పత్తికొండ, మే 29, ప్రభాతవార్త** కన్న తండ్రి చనిపోయిన కొడుకులు రారు అన్న ఉద్దేశ్యంతో తల్లి లలిత భర్త పోదిగంటి హరికృష్ణ ప్రసాద్(63)కు ఎవరికీ తెలియకుండ ఇంటిలోనే దహన సంస్కారాలు చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు ఇలా వున్నాయి. పట్టణానికి చెందిన పోదుంటి హరికృష్ణ ప్రసాద్ పట్టణంలో మెడికల్ షాప్‌తో జీవనం సాగిస్తున్నాడు. హరికృష్ణ ప్రసాద్‌కు భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడు దినేష్ డాక్టర్‌గా కర్నూలు పట్టణంలో పని చేస్తున్నాడు, చిన్న కుమారుడు సాఫ్ట్‌వేర్‌గా కెనడా దేశంలో ఉన్నాడు. హరికృష్ణ ప్రసాద్ గత నాలుగేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాళ్ల చేతులు పడిపోయాయి. హరికృష్ణ ప్రసాద్‌కు భార్య ఒక్కటే సేవలు అందించుకుంటూ ఉండేది ఆదివారం రాత్రి హరికృష్ణ ప్రసాద్ చనిపోవడంతో భర్త బతికుండగానే నా కొడుకులు రాలేదు..ఇప్పుడు కూడా రారు..అనే ఉద్దేశ్యంతో ఇంటిలోనే భర్తకు



దహన సంస్కారాలు చేసింది. ఇంటిలో ఉన్న అట్టపెట్టెలు, చీరలు వేసి కాల్చి వేసింది. ఇంటిపక్కల ఉన్న వారికి దుర్వాసన రావడంతో ఇంటిలోకి వెళ్లి చూశారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి చుట్టుపక్కల వారు భర్తకు సేవ చేయలేక భర్తను చంపేసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తండ్రి చనిపోయాడని సమాచారం తెలుసుకున్న పెద్దకొడుకు దినేష్ ఇంటికి చేరుకున్నాడు. పట్టణంలో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదని ఇలాంటి ఘోరమైన పరిస్థితి ఏ తల్లిదండ్రులకు రాకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.

# మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులను ఖండించండి

**నందికొట్కూరు,మే 29,ప్రభాతవార్త :** మహిళా రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు,బిజెపి ఎం.పి.బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నెల రోజులుగా శాంతి యుతంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక ఆంధోళన చేస్తున్న రెజ్లర్లను అరెస్టు చేయడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలని డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షులు గాదె రోశన్న కోరారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయకుండా కాపాడుతున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను నిరసిస్తూ వెంటనే ఎం.పి.పై చర్యలు తీసుకొని రెజ్లర్లకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పథకాలు సాధించిన వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్ వంటి ఎంతో మంది క్రీడాకారులు ముందు వరసలో నిలబడి మహిళా క్రీడాకారులుగా అథ్లెట్లుగా తాము ఎదుర్కోంటున్న లైంగిక వేధింపుల్ని, అవమానాల్ని దారుణ పరిస్థితుల్ని బహిరంగంగా వివరిస్తూన్నారన్నారు. అంతర్జాతీయ క్రీడా వేడుకల్లో పథకాలు సాధించినప్పుడు అదంతా తమ ఘన కీర్తిగా దేశ ప్రతిష్టగా చాటుకుంటున్న క్రీడా సమాఖ్యాలు, రాజకీయ నాయకులు ప్రభుత్వాలు మహిళా క్రీడాకారులుగా తాము ఎదుర్కోంటున్న సమస్యల గురించి చెప్పి నప్పుడు దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లర్లు చేస్తున్న ఆంధోళనకు మద్దతుగా నిలిచిన వారిపై కూడ కేసులు నమోదు చేస్తు నిర్భంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైన కేంద్రం స్పంధించి రెజ్లర్ల అంధోళనకు కారణమైన ఎం.పి.పై చర్యలు తీసుకోవాలని, అంత వరకు న్యాయం కోసం ఉద్యమిస్తున్న మహిళా రెజ్లర్లకు సంఘీబావంగా నిలబడుదామని ఆయన డిమాండ్ పిలుపు నిచ్చారు.

## సామాన్యులకు అధికారం.. కట్టబెట్టిన ఘనత.. వైసిపిదే..!

(మొదటి పేజీ తరువాయి ) : పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ముఖ్యమంత్రి జగన్,మంత్రి జయరాం,మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు,గుమ్మనూరు నారాయణస్వామిలకు రుణపడి ఉంటానన్నారు. తనకు అప్పజెప్పిన ఈ భాధ్యతను సక్రమంగా నిర్వర్తించి నియోజకవర్గ ప్రజలు,రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందచేస్తామని పేర్కొన్నారు. యార్డు,రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి 6మండలాల నుండి తరలివచ్చిన వైకాపా నాయకులు,కార్యకర్తలు, జడ్‌పిటిసిలు,ఎంపిపిలు, సర్పంచ్‌లు,ఎంపిటిసిలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏరూరు శేఖర్,మండల కన్వినర్ వీరేష్, హొళగుంద కన్వినర్ షఫీవుల్లా,హొళగుంద ఎంపిపి నూర్జహాన్ తనయుడు ఈసా,అన్ని మండలాల వైకాపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## డోన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా.. స్కిల్ హబ్

(మొదటి పేజీ తరువాయి ) :

**విద్యావంతుడు ప్రజాప్రతినిది అయితే...ఇదే మార్పు:**

చదువుకున్న బుగ్గన ప్రజాప్రతినిది కావడంవల్లనే డోన్‌లో ఇంతటి మార్పు వచ్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 70ఏళ్ళు నాటినుంచికూడా డోన్ ప్రాంత అభివృద్ధికి ఎవ్వరూ పాటుపడలేదని అధికారులు, పార్టీ నైతలైన మీట్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, ఎంపిపి, జడ్పీటిసిలు అన్నారు. గత పాలకులంతా వ్యక్తిగత స్వార్థంతో నాకేంవస్తుందని పనిచేసారని ఒక్క బుగ్గన ప్రజలకేం చేయగలననే తపనతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ డోన్ చరిత్రలో, ఈ ప్రాంత ప్రజల్లో శాశ్వితంగా నిల్చిపోతున్నారు, ఒక విద్యావంతుడు దూరదృష్టితో ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారని అన్నారు. కార్య క్రమంలో ఎపిఎస్ ఎన్‌డిసి ఎండి వినోద్‌కుమార్, ఎపి సిడ్యాప్ సిఇఒ శ్రీనివాసులు, ఉపాధి శిక్షణ డైరెక్టర్ నవ్య, ఐటిఐ ప్రిన్సిపాల్ బద్రీనాథ్, కియా సంస్థ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్ డాంగ్ లీ, లీగల్ కార్పోరేట్ ఎఫైర్స్ హెడ్ యోంగిమా, ప్రిన్సిపల్ అడ్వైజరీ సోమశేఖర్‌రెడ్డి, ఛైర్మన్ రాజేష్, ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాది నాగభూషణంరెడ్డి, జడ్పీటిసి రాజ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి, టిఇ దినేషగౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుస్సేన్, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బైక్‌ర్యాలీకి భారీగా తరలిరావాలి

**– జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి**

**మద్దికెర,మే 29,ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళ పూర్తయిన సందర్భంగా నేడు ఉదయం 8గంటలకు పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆద్వర్యంలో ప్రభుత్వ గెస్టహౌస్ దగ్గర నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు జరుగు బైక్ ర్యాలీకి నాయకులు,కార్యకర్తలు భారీగా తరలిరావాలని జడ్‌పిటిసి మురళీధర్‌రెడ్డి, ఎంపిపి అనితయాదవ్,సర్పంచ్ బండారు సుహాసినిలు సోమవారం పిలుపునిచ్చారు. మండలంలోని నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివచ్చి బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మాలల సింహగర్జనకు తెలంగాణ ఎమ్మెల్సీ పద్మశ్రీ గొరటి వెంకన్న రాక



**ఆలూరు,మే 29,ప్రభాతవార్త :** ఈ నెల 31న ఆలూరు పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు జరుగనున్నమాలల సింహగర్జన సభకు ముఖ్యఅతిధులుగా తెలంగాణ ఎమ్మెల్సీ పద్మశ్రీ అవార్డు గ్రహీత గొరటి వెంకన్న,మాజీ ఎంపి హర్షకుమార్, మాజీ మంత్రి ఆనంద్‌బాబులు హాజరవుతున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది తెలిపారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ వెనకబడిన నియోజకవర్గం ఆలూరులో జరుగనున్న మాల సింహగర్జన సభకు నియోజకవర్గంలోని మాలలందరు ఏకమై పార్టీలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు హత్తిబెళగల్ ఈరన్న,హత్తిబెళగల్ లక్ష్మినారాయణ,నాగరాజు,హెబ్బటం వన్నూరప్ప,కురుకుంద గోపాల్,పెద్దహ్యాట వీరభద్ర,తుంబళబీడు వెంకటేష్,చిన్నహోతూరు భరత్, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశాయి తాండలో మంచినీటి సమస్యను పరిష్కరించండి

**తుగ్గలి,మే 29,ప్రభాతవార్త :** మండల పరిధిలోని జొన్నగిరి గ్రామ పంచాయతీలోని దేశాయి తాండాలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. సోమవారం దేశాయి తాండాలో ఉన్న చెడిపోయిన చెడిపోయిన బోరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నగిరి పంచాయతీ దేశాయి తాండలో నీటి సమస్య ఉందని అధికారులకు చెప్పినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం కంటి తుడుపుగా నీటి ట్యాంకులు పెట్టారే తప్ప అవి ఎప్పుడు వస్తున్నాయో ఎప్పుడు ప్రజలకు నీరు పోస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దేశాయి తాండాలో బోర్లలో నీరు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్పందనలో పలుమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జొన్నగిరి గ్రామ పంచాయతీ దేశాయి తాండాలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## టీడీపీ హయాంలోనే మహిళల అభివృద్ధి

**బనగానపల్లెరూరల్,మే29,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమని,రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా బీసీ ఇందిరారెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని మహిళలకు వరాలజల్లులు కురిపించడంతో ఈ పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.అదే విధంగా రాజమండ్రి సమీపంలోని రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో నారా చం ద్రబాబు నాయుడు మేనిఫెస్టోను సిద్ధం చేసి ప్రకటించారన్నారు. అందులో భాగంగానే భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో రాష్ట్రంలోని మహిళలందరికి చంద్రబాబు నాయుడు వరాల జల్లులు కురిపించారన్నారు.ఈ మేరకు ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాలలోపు ప్రతి మహిళకు నెలకు రూ.1500లు ఇవ్వడం జరుగుతుందని అదే విధంగా తల్లికి వందనం అనే కార్యక్రమం ద్వారా ఇంట్లో ఎంతో మంది పిల్లలు చదువుతున్న ప్రతి ఒక్కరికి సంవత్సరానికి రూ.15వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.అలాగే దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికి సంవత్సరానికి ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.అదే విధంగా ఆర్టీసీ బస్సుల్లో జిల్లా పరిధిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు.అనంతరం రా ష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు ఇప్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఇలా మన మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మహిళల కోసం ఎన్నో వరాలజల్లులు కురిపించారని ఆమె తెలియజేశారు.కావునా మనమందరం 2024 ఎన్నికల్లో తప్పనిసరిగా టీడీపీకి ఓటువేసి ముఖ్యమంత్రిగా నారా చం ద్రబాబు నాయుడును అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అలాగే గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిరుద్యోగుల కోసం ప్రవేశపెట్టిన నిరుద్యోగభృతిని ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ నిరుద్యోగభృతిని తొలగించడం జరిగిందన్నారు.అదే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులను నిట్టనిలువునా ముంచేశారన్నారు. కావునా యువత,నిరుద్యోగులు రానున్న 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడిని గెలిపించుకుని నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేంతవరకు ప్రతినెల రూ.3వేలు చొప్పున నిరుద్యోగభృతిని ఇచ్చి నిరుద్యోగులను ఆదుకోవడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ప్రతిష్ట వార్షికోత్సవం

**ప్యాపిలి మే29(ప్రభాతవార్త):** ప్యాపిలి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నుండి మంగళవారం వరకు వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అయ్యప్పస్వామి గుడి అధ్యక్షులు మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరిహర పుత్రుడు అయ్యప్పస్వామిని ప్రతిష్టించి 17 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం గణపతి పూజ పుణ్యావచనం, నవగ్రహజపం, గణపతిహోమం, అభిషేకం, అయ్యప్పస్వామికి సర్వాభిషేకాన్ని నిర్వహించినట్లు వివరించారు. మంగళవారం స్వామికి సర్వదేవతల అభిషేకం, లలితాదేవి సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, హనుమాన్‌చాలీసా, అన్నపూర్ణదేవికి వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సహయకులు రాజా మురళి, రాజా రవి, సుధాకర్‌నాయుడు, జోన్నలగడ్డ హరి తదితరులు పాల్గొన్నారు.

## నాడు నేడు పనులను పరిశీలించిన జిల్లా మానిటరింగ్ అధికారి

**నందికొట్కూరు,మే 29,ప్రభాతవార్త:** మండలంలోని పాఠశాలలలో జరుగుతున్న నాడు నేడు పనుల పురోగతిని సోమవారం నంద్యాల జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీమతి లలిత మరియు ఉర్దూ పాఠశాలల మానిటరింగ్ అధికారి యూనస్‌బాష పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సబ్బారావుపేట పాఠశాల, జీవికే పాయింట్, నాగటూరు, బిజినవేముల, దామగట్ల జిల్లా పరిషత్ పాఠశాల, ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించి పనుల నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో విద్యార్థుల కొరకు తెచ్చిన పుస్తకాల స్టాక్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో యం.ఇ.ఓ, ఫైజున్నిషాబేగం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీ బైక్ ర్యాలీగా బయలుదేరిన మాజీ మండల ఉపాధ్యక్షులు గాజ కృష్ణారెడ్డి

**– యర్రగుంట్ల నుంచి వెల్లువిరిసిన ప్రజాభిమానం**

**శిరివెళ్ల, మే 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని యర్రగు ంట్ల గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షులు గాజ కృష్ణారెడ్డి అధ్వర్యంలో రాష్ట్రంలో వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డలో గంగుల బిజేంద్రారెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకున్నశుభసందర్భంగా భారీ జనసందోహం మధ్య బైక్‌ర్యాలీతో ఆళ్లగడ్డకు బయలుదేరారు. గ్రామంలో ప్రజాభిమానం వెల్లువిరిసి భారీ సంఖ్యలో జగనన్న సైనికులు గంగుల అభిమానులు బైకుర్యాలీగా బయలుదేరారు. ఆళ్లగడ్డలో నిర్వహిస్తున్న బైకు ర్యాలీకి సంఘీభావంగా మాజీ మండల ఉపాధ్యక్షులు గాజ కృష్ణారెడ్డి అధ్వర్యంలో గంగుల అనుచరులు, జగనన్న సైనికులు జన ఉప్పెనలా బైకుర్యాలీగా బయలుదేరారు.

## గుంతకందాల గ్రామంలో అదపులోకి వచ్చిన అతిసారా వ్యాధి

**వెలుగోడు,మే 29,ప్రభాతవార్త:** గత ఐదు రోజులుగా గుంతకందాల గ్రామంలో ప్రజలు అతిసారా వ్యాధి బారిన పడి ఆంధోళనక గురి అయ్యారు. అప్రమత్తమైన వైద్యాధికారులు వెంటనే నివారణ చర్యలు చేపట్టడంతో వ్యాధి అదుపులోకి వచ్చింధి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.వంశీకృష్ణ ఆధ్వర్యంలో 24గంటల మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.జహీర్‌వలి, గ్రామ సర్పంచ్ అచ్చమ్మ, ఎం.పి.హెచ్ఇఓ శ్రీనువాసులు, పిహెచ్ఎన్ దానమ్మ, గ్రామ సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వాలెంటీర్ల సేవలు ఎనలేనివి

**కొత్తపల్లి,మే 29,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందజేస్తున్న వాలెంటీర్ల సేవలు ఎనలేనివని మీ శ్రమ వృధాకాదని మండల జడ్పీటిసి సభ్యులు సోమల సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ సచివాలయ పరిధిలోని వాలెంటీర్లక వందనం కార్యక్రమంలో భాగంగా వారిని దుశ్శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన భాధ్యతను సక్రమంగా నిర్వమిస్తూ ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు చేరవేయడంలో వాలెంటీర్ల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జమిలాభీ, ఎం.పి.టి.సి.ముబినాభీనా బేగం, పంచాయితీ కార్యదర్శి షాహీన్‌సా, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు పాల్గొన్నారు.

## యువకుడిపై దుండగుల దాడి.. కేసు నమోదు

**ఆదోనిటౌన్, మే29, ప్రభాతవార్త ;** పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు వద్ద గత అర్ధరాత్రి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రమేష్ అనే యువకుడిపై దాడి చేసి అతని వద్ద నుంచి రూ.1000 నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలించిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఓ కోచింగ్ సెంటర్‌కు సంబంధించిన పామ్‌లెట్‌లను ఆలూరులో అతికించి తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళ్తుండగా ఆదోనిలోని తిమ్మారెడ్డి బస్టాండు వద్ద దుండగులు బైకుపై తన బైకును ఢీకొట్టారని చెప్పారు. కింద పడిన తనను చితకబాది తన వద్ద ఉన్న రూ.1000 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను, బైకును తీసుకొని పారిపోయారన్నారు. అయితే కొంత దూరంలో బైకును పడేసి వెళ్లారన్నారు. తాను ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వన్టౌన్ పోఈలసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు విలేకరులకు తెలిపారు.

## పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవిని కలిసిన పత్తికొండ నూతన డిఎస్పీ



**వెల్దుర్తి,మే29,ప్రభాతవార్త :** పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవికి సోమవారం పత్తికొండ సబ్‌డివిజన్ నూతన డిఎస్పీ శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఇందుకు తమ వంతు పూర్తి సహాకారం అందిస్తానని ఆమె డిఎస్పీతో అన్నారు.అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలిస్తానని డిఎస్పీ అన్నారు.

## పెరిగిన దుర్గా భోగేశ్వర ఆలయ భూముల కౌలు ఆదాయం

**– రూ.4,04,700 ఆదాయం**

**గడివేముల, మే29, ప్రభాతవార్త ;** మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపాన గల శ్రీ దుర్గా భోగేశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించిన భూములకు సోమవారంనాడు పర్యవేక్షణ అధికారి వి.గోపి పర్యవేక్షణలో ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో గత సంవత్సరంతో పోలిస్తే రూ.4,04,700 ఆదాయం వచ్చిందన్నారు. గత సంవత్సరం రూ.8,05,000 ఆదాయం రాగా, ఈ సంవత్సరం రూ.12,09,700 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి వి.గోపి, ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఐ.సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వర్‌రెడ్డి, శివుడు, శ్రీనివాసులు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో దుక్కులు పంటలకు బహుళ ప్రయోనాలు

**–ఎఓ శ్రీకృష్ణ**



**దొర్నిపాడు(కోవెలకుంట్ల),మే 29,ప్రభాతవార్త :** వైసవి కాలంలో రైతులు తమ పొలాల్లో దుక్కులు దున్నుకోవాలని వాటి వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని దొర్నిపాడు ఎఓ శ్రీకృష్ణ చెప్పారు. సోమవారము దొర్నినాడు వ్యవసాయ కార్యాలయంలో ఎఓ మాట్లాడుతూ ప్రస్తుతము వేసవి కాలం ఉందని రైతులకు సంబందించిన పొలాలు ఖాళీగా ఉంటాయని చెప్పారు. ఈలాంటి సమయంలో రైతులు పొలాన్ని దుక్కులు చేసుకోవాలని చెప్పారు. ఈ వేసవి దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా పంటలు సాగు చేసిన పిదప చీడపీడలు అశిస్తుంటాయి. అవి భూమిలో నుండి వెలువడుతాయని చెప్పారు. అయితే వేసివి దుక్కుల వల్ల చీడ పీడకు సంబందించిన లార్వా దశలో ఉన్న గ్రుడ్లు కూడా బయటకు వస్తాయని చెప్పారు. ఈ ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయని చెప్పారు. అలాగు దుక్కుల వల్ల తొలకరిలో పడ్డ వర్షాలకు భూమిలోకి ఇంకిపోతుందని చెప్పారు. దీనితో మీ పొలాల్లో తేమ శాతము అదికముగ పెరుగుతుందని చెప్పారు. వెత వేడికి చీడపీడలు చని పోవడమే కుండా తోలకరి వర్షాలు భూమిలో తేమ శాతము పెరుగడముతో రైతులు ఖరీప్ సాగును అవలీలగా సాగు చేయడానికి అవకాశము ఉంటుందని చెప్పారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**ప్యాపిలి మే29(ప్రభాతవార్త):**

ప్రజలకు అందుబాటులో ఉంటూ వాలంటర్లు మెరుగైన సేవలను అందించాలని జడ్పిటసిఇ బోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయ ఆవరణలో సోమవారం మండలంలోని వాలంటర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్ళి వాలంటర్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తున్న వాలంటర్ల పనితీరును గుర్తించి సన్మానం చేయడంతో పాటు ప్రోత్సహక బహుమతులు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా వాలంటర్లు నిలిచి అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించి ప్రజల మెప్పును పొందాలని సూచించారు. భవిష్యత్తులో కూడ వాలంటర్లు నిష్పక్షపాతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వరరెడ్డి, గండికోట చిన్న రామాంజనేయులు, సోమశేఖర్, నిజాముద్దీన్, అంజి, శ్రీనివాసులు, ఎమ్పిడివో ఫజిల్‌రహిమాన్, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విధ్యుత్ స్థంబాలు

**కొత్తపల్లి,మే 29,ప్రభాతవార్త:** ఏ మాత్రం అదమరిస్తే పైకి పోవలసిందే. మండలంలో పలుచోట్ల విధ్యుత్ స్థంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. చిన్న గుమ్మడాపురం బస్‌స్టాఫ్ నుంచి గ్రామంలో వెళ్ళే దారిలో విధ్యుత్ స్థంభాలు ఒరిగి పోవడంతో సపోర్టుగా ఉన్న తీగలు తెగిపోయి కిందికి వ్రేలాడుతున్నాయి. ఏమరపాటున చేయి పైకి ఎత్తితే ప్రాణాలు హారి అనాల్సిందేనని స్తానికులు ఆంధోళనలు చెందుతున్నారు. అలాగే రోడ్డుపై వెళ్ళే వాహానాలకు సైతం ఈ ప్రమాదం పొంచి ఉంది. దీనిపై సంభంధిత విధ్యుత్ శాఖ అధికారులకు తెలిపిన స్పంధించడం లేదని ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని జరగబోయే ప్రమాదాలను నివారించాలని స్తానికులు కోరారు.

## మహానాడులో చంద్రబాబును కలిసిన తెదేపా యువ నాయకులు



**ఆదోని రూరల్,మే 29,ప్రభాతవార్త :** రాజమండ్రిలో జరిగిన మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును టిడిపి యువ నాయకులు మారుతినాయుడు,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరిలు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన తెదేపా భారీ విజయం ఖాయమన్నారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన టిడిపి మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తెదేపా విజయానికి కృషి చేస్తామన్నారు. అలాగే యువగళం పాదయాత్ర ఆదోనిలో భారీఎత్తున విజయవంతం చేసినందుకు ఆదోని ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## 'పట్టు బడిన వాహానాలకు వేలం పాటలు'

**కొలిమిగుండ్ల, మే 29, ప్రభాతవార్త**

మండలంలోని వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహానాలను సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలం పాటల ద్వారా విక్రయించారు. కొలిమిగుండ్ల తహాశీల్దార్ ధోనీ ఆల్‌ఫ్రెడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌రెడ్డి ఈ వేలం పాటలను నిర్వహించారు. మొత్తం 6మోటార్‌సైకిళ్లకు వేలం పాటలు నిర్వహించగా జీఎస్టీతో సహా మొత్తం రూ.52,510 ఆదాయం లభించినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. నంద్యాల అర్టీఓ గారు నిర్ణయించిన ధరల ప్రకారం వేలం పాటలు నిర్వహించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## గుండ్లకొండలో డెంగ్యూ కేసు నమోదు

**దేవనకొండ,మే 29,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని గుండ్లకొండ గ్రామంలో 7సం॥ల బాలికకు డెంగ్యూ వ్యాధి సోకినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ కేసు నమోదు కావడంతో గ్రామాన్ని సందర్శించి కేసు వచ్చిన ఇంటి పరిసరాల్లో స్ప్రే చేయించినట్లు తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండ సీజనల్ వ్యాధుల గూర్చి అవగాహన కల్పించామన్నారు. అలాగే ప్రతిఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ఈశ్వరయ్య,రాంమోహన్,ఏఎన్ఎంలు,ఆశలు పాల్గొన్నారు.

## ఎస్‌సి హాస్టల్‌ను పున:ప్రారంభించాలి

**– టిఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున**

**హొళగుంద,మే 29,ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన హొళగుందలో ఎస్‌సి హాస్టల్ పున:ప్రారంభించాలని టిఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హొళగుంద మండల కేంద్రంలో అనేక మంది పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ఇందులో మధ్య తరగతి కుటుంబంలో ఉన్న పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. అనేక సందర్భంలో విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుండైనా ఎస్‌సి హాస్టల్ తిరిగి ప్రారంభించి పేద విద్యార్థులందరికి విద్యను అందించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యాసంవత్సరం మొదటిరోజు నుంచి ఎస్‌సి హాస్టల్‌ను తిరిగి ప్రారంభించే వరకు క్రమంగా టిఎన్ఎస్ఎఫ్ ఆద్వర్యంలో ఉద్యమానికి పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు.

## మనుషులలో శరీర,నేత్ర ఆశలు ఉండకూడదు

**– ముఖ్య ప్రసంగీకులు ఎస్‌జె జీవన్ రావు**

**కర్నూలు రూరల్,మే 29,ప్రభాతవార్త :** మనుషులలో శరీర ఆశ,నేత్ర ఆశ,జీవ దంభం ఉండకూడదని ముఖ్య ప్రసంగీకులు ఎస్‌జె జీవన్ రావు అన్నారు. మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో ఏబిఎం సంఘం వారు నిర్వహించిన 7వ రక్షణ సువార్త పండుగలు స్థానిక సంఘ కాపరి రెడ్డిపోగు సోమన్న ఆద్వర్యంలో ఈఎస్‌టి కర్నూలు వారి సహకారంతో శుక్ర,శని, ఆదివారాలు మూడురోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య ప్రసంగీకులు ఎస్‌జె జీవన్‌రావు మాట్లాడుతూ మనుషులలో శరీర,నేత్ర,జీవ దంభంలాంటివి ఉండకూడదని వీటిని మనుషులు ఆధీనంలో ఉంచుకుంటే వారి జీవితాలు సుఖప్రదంగా ఉంటాయన్నారు. ప్రతి మనిషి తన వారిని తన పొరుగు వారిని ప్రేమించాలన్నారు. తనది కానిది దేనిని ఆశించకూడదన్నారు. దేవుని యందు భయభక్తులు కలిగి జీవించాలని వాఖ్య సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్‌టి సంఘం ఎం రాజు,బి విజయకుమార్,ఆర్ జయపాల్,మహేష్,ఈశ్వర్,రమేష్,సురేష్,భాను,ఏబిఎం సంఘ పెద్దలు రెడ్డిపోగు ప్రసాద్,బాబు,ఆర్ వెంకటేశ్వర్లు,ఎం సుంకన్న,జి నాగరాజు,ఆర్ సత్యం,ఎం సుధాకర్,ఆర్ వెంకటేశ్వర్లు, ఎం సంజీవులు,ఎం ఎర్రరాజు,ఎబిఎం సంఘ యవ్వనస్తులు జగజీవన్‌రాజు, మధుబాబు, స్టీఫెన్ కిషోర్,లోకన్న,సునీల్, సుంకన్న,విజయ్,బ్రాహ్మణకోట్కూరు పాస్టర్ ఇమ్మానియేలు,మాస్‌పేట పాస్టర్ ప్రవీణ్‌కుమార్,నందికొట్కూరు పాస్టర్ డేవిడ్, గార్గేయపురం ఆర్ఎ అరుణశ్రీ పాస్టర్ అమ్మ రెవరెండ్ భూషణం,శ్యామలమ్మ, ఎబిఎం సంఘ పెద్దలు,యవ్వనస్తులు,స్త్రీలు పాల్గొన్నారు.

## మహా అద్భుతంగా టిడిపి మేనిఫెస్టో

**మద్దికెర,మే 29,ప్రభాతవార్త :**

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మహిళా సాధికారిక టిడిపి మేనిఫెస్టో మహాఅద్భుతంగా ఉందని టిడిపి టౌన్ ప్రెసిడెంట్ గద్దం రామాంజనేయులు,మండల కార్యదర్శి పెరవలి రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి కింద 18సం॥లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు నేరుగా వారి ఖాతాల్లోకి జమ,తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమంది పిల్లలకు ఏడాదికి రూ.15వేలు వారి ఖాతాల్లోకి జమ,దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం,ఉచిత బస్సు ప్రయాణం పథకం కింద మహిళలకు టికెట్టు లేని ప్రయాణం కల్పించడం ఆదివారం మహానాడు కార్యక్రమంలో టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం మహిళలందరు సంతోషకరమైన వార్తగా భావించారన్నారు. అమ్మఒడి కింద కేవలం ఒక విద్యార్థికే అమ్మఒడి పథకం అమలు చేయడం అలాగే అమలు చేసిన దానిలో పాఠశాల డెవలప్‌మెంట్ కొరకు అందులో కోత విధించడం ఈ విధంగా లేకుండ కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు చదువుకునే వసతి కల్పించడం జరుగుతుందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని దీపం పథకం కింద మా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం,బస్సులో ఉచిత ప్రయాణ వసతి కల్పించడం శుభపరిణామమన్నారు. మహిళల అభ్యున్నతి కోసం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

## బ్యాగరోళ్లకు సమాజిక ఫించన్లు మంజూరు చేయాలనీ వినతి

**పగిడ్యాల, మే 29,ప్రభాతవార్త :** పగిడ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని సచివాలయం -2 కు సంబందించిన స్మశాన కార్మికులు (బ్యాగరోళ్లు) తమకు సామాజిక ఫించన్లు మంజూరు చేయాలనీ కోరుతూ సోమవారం పంచాయతీ కార్యదర్శి మంజులాదేవికి వినతిపత్రం సమర్పించారు. తమ ఆర్థికపరిస్థితిని దృష్టిలోవుంచుకుని మానవతా దృక్పథంతో అలోచించి ఫించన్లు మంజూరుచేయాలనీ బ్యాగరోళ్లు కోరారు. ఈ కార్యక్రమంలో కులవివక్షత వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షురాలు గంధం ఉశేనమ్మ,గ్రామపంచాయతీ సర్పంచ్ పెరుమాల శేషన్న, బ్యాగరి సురేష్, నల్లన్న, దేవరాజు, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక నాణ్యత పరిశీలన

**తుగ్గలి,మే 29,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన తుగ్గలిలోని ఎంఆర్‌సిలో జగనన్న విద్యాకానుక కిట్ల నాణ్యతను జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె వేణుగోపాల్ మండల విద్యాశాఖ అధికారి రమా వెంకటేశ్వర్లుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగానే ఆయన విద్యార్థులకు అందించే షూస్ నాణ్యతను పరిశీలించి షూ యొక్క కొలతను కొలచి ఆ నంబర్‌ను యాప్ నందు నమోదు చేయాలని ఎంఆర్‌సి సిబ్బందికి సూచించారు. పాఠశాలలు తెరిచేలోగ ప్రతి పాఠశాలకు జగనన్న విద్యాకానుక కిట్లు చేరేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు సూచించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని వారికి ఆదేశించారు.అలాగే 10వ తరగతి రీమీడియట్ తరగతులను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ప్రతిఒక్కరు కచ్చితంగా పాస్ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివశంకర్,ఐఈసిఓ కోఆర్డినేటర్ విజయప్రసాద్,ప్రధానోపాధ్యాయురాలు ఉమాతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 'అదుపు తప్పిన సిమెంట్ ట్యాంకర్ .. తప్పిన ప్రమాదం'

**కొలిమిగుండ్ల, మే 29, ప్రభాతవార్త**

అనంతపూర్- అమరావతి ప్రధాన రహదారిపై మండలకేంద్రమైన కొలిమిగుండ్ల సమీపంలోని కస్తూరిభా పాఠశాల వద్ద ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపు తప్పి కంప చెట్లలోకి దూసుక వెళ్లింది. తాడిపత్రి వైపు నుండి బనగానపల్లె వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ మలుపు వద్ద అదుపు తప్పి రహదారి పక్కనున్న కంపల్లోకి దూసుకవెళ్లింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిమెంట్ ట్యాంకర్‌ను పక్కకు తొలగించడానికి చర్యలు చేపట్టారు.

## గ్రామ వార్డు వాలంటీర్లకు అవార్డులతో సన్మానించిన ఎమ్మెల్యే


వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల

**ఆళ్లగడ్డ, మే 29, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ మహాలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ఆళ్లగడ్డ మున్సిపాలిటి పరిధిలోని గ్రామ వార్డు వాలంటీర్లకు సేవా, వజ్ర, సేవారత్న అవార్డులతో ఎమ్మె ల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) వారిని ఘనంగా సన్మాని ంచారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల రాఘవేం ద్రారెడ్డి, వైసీపీ కన్వీనరు గొటూ ్లరు సుధాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, వైసీపీ నాయకులు సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, శివనాగిరెడ్డి, పడకండ్ల వైసీపీ నాయకులు బద్రి సుధాకర్‌రెడ్డి, బద్రి భాస్కర్‌రెడ్డి, సింగం నాని, కాంట్రాక్టర్ నజీర్, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



### :- మంత్రి గుమ్మనూరు జయరాం

**ఆలూరు, మే 29, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం పట్టణం లోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్ నందు మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రమాణస్వీకారం సందర్బంగా మంత్రి జయరాం సమక్షంలో చిప్పగిరి మండలం బెల్డోన తెలుగుదేశం పార్టీ గ్రామ సర్పంచ్ భర్త మరియు కోట్ల సుజాతమ్మ ముఖ్య అనుచరుడు గోవిందు మరియు భూపాల్ వారి అనుచరులు, తెదేపా మద్దతుదారులు వైకాపా పార్టీలో చేరారు. వారికి మంత్రి జయరాం వైకాపా పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్బంగా మంత్రి జయరాం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అలాగే వైకాపా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైకాపా పార్టీని మరింత బలోపేతం కృషి చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామి, ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ తదితరులున్నారు.

## అక్రమ మద్యం తయారీ కేంద్రంపై దాడులు



**ఆదోనిటౌన్, మే29, ప్రభాతవార్త ;** ఆదోని పట్టణంలోని పుల్లెల్ల కొండపైన సారా తయారీ కేంద్రంపై సోమవారం దాడి చేసి తయారీ కోసం సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారా యిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ విలేకరులకు తెలిపారు. ముద్దాయి బోయ లాల్ స్వామిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అలాగే ఆదోని పట్టణంలోని బావాజీపేటలో ఉన్న బోయ రాధమ్మనున్న 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు అక్రమ కర్ణాటక మద్యం, నాటుసారా తయారీపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పీసీలు ముని, రోహిన్, శ్రీనులు పాల్గొన్నారు.

## దేవస్థానంలో అభివృద్ధి పనులకు



## శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**కౌతాళం, మే29, ప్రభాతవార్త ;** మండలంలోని ఉరుకుందలో వెలిసిన ఈరన్నస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు ఆలయ ఈఓ వాణణ ఆధ్వర్యంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి భూమిపూజ చేశారు. స్వామివారి ఆలయంలో నూతన గ్రానైట్ బండ పరుపు పనులకు వేద పండితులు వేద మంత్రాలు పఠిస్తుండగా ఎమ్మెల్యే శంకుస్థాన కార్యక్రమం చేపట్టారు. అంతకముందు జుమ్మలదిన్నె గ్రామం నుంచి ఉరుకుంద ఈరన్నస్వామి వారి ఆలయం వరకు బైకు యాత్రగా ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరన్నస్వామి వారి అభివృద్ధి పనుల్లో తాను పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈరన్నస్వామివారి ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. రూ.1,28,00,000లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగరాజుగౌడ్, ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణంరాజు, జెడ్పీటీసీ రాధ ప్రియదర్శిని, వైస్

# ఏవరికి ఎక్కడ కొమ్ముకాసే పత్రిక కాదు "వార్త"

### -ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ప్రజలకు అండ "వార్త" పత్రిక
### -పత్రికలలో "మేటి ఘనపాటి వార్త" పత్రిక






**నంద్యాల విద్య, మే 29, ప్రభాతవార్త:** పత్రికలకు సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆపత్రిక స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే నీతి, నిజాయితీ, అన్యాయాన్ని ఎదుర్కొవడం, పేదల పక్షాన పోరాడడం వంటి సంఘటనలతో ప్రజలు హర్షించదగ్గ సంఘటనలు జరిగినప్పుడు వార్తలు ప్రచారం చేసి పాఠకుల మనస్సు దోచుకున్న పత్రిక ఏదైనా ఉంది అంటే పత్రికలలో మేటి ఘనాపాటి పత్రిక వార్త దినపత్రిక అని పలువురు ప్రశంసిస్తునారు. సోమవారం 27వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టరు టి నిశాంతి, డిఆర్వో బిజ్జం పుల్లయ్య, డిపిఆర్ఓ మల్లిఖార్జున, జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనురాధలు అవిష్కరించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ తన మన అనే బేదం లేకుండా పేదల పక్షాన నిలబడి నిజాయితీగా వార్తలు రాస్తున్న వార్త పత్రికను అభినందించారు. ప్రతియేడాది వార్షికోత్సవ ప్రత్యేక సంచికను విడుదల చేయడమంటే అషామాషి వ్యవహారం కాదని అన్ని పత్రికన్నా వార్త పత్రిక ప్రజల్లో విశ్వసనీయతకు నిదర్శనంగా నిలుస్తుందని కితాబిచ్చారు. వార్త పత్రిక సిఎండి గిరీష్ సంఘ్వీ గారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు గౌరవ సంఘ్వీ గారు అధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా పాఠకుల అభిమానాన్ని విశ్వసనీయతను చాటుకున్నారు. ప్రజల మనోభావాలను ప్రస్పుటించేలా విభిన్నమైన రితీల్లో వార్తలు ప్రచురించి పాఠకుల జీవితాల్లో ఒక భాగం వెలుగునొందుతూ వస్తుంది. ప్రాంతాలు, రాజకీయాలు, వర్గాలు, కులమతాలకతీతంగా పత్రికరంగంలో తనదైన వ్యవహార శైలీతో జర్నలిజానికి ఉన్న గౌరవాన్ని మరింత ఇనుమడింప చేయడంలో "వార్త" ప్రత్యేకతను సంతరించుకుంటూ వస్తోంది. ఏవరికి ఎక్కడ కొమ్ముకాసే విధంగా వ్యవహారించిన దాఖలాలు వార్త పత్రికల్లో కనబడవు. వార్త కుటుంబం అనేక సహాయ కార్యక్రమాలు చేపడుతూ వస్తోంది. విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ ప్రజల ముంగిటకు వార్త దినపత్రిక యాజమాన్యం రిపోర్టర్లు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని వక్తలు కొనియాడారు. నూతన జిల్లా ఏర్పడిన తరువాత 27వ వార్షికోత్సవాన్ని ప్రజలే అండగా 27 ఏళ్ళ పండుగ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రతిజిల్లాలో నిర్వహించుకోవడం విశేషం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వార్తపత్రికలు మేనేజర్ మధుసూధన్‌రావు అధ్వర్యంలో డేస్క్ ఇంచార్జ్ మధు, రంజీత్, అడ్వర్‌టైజ్‌మెంట్ శ్రీనివాసరావుల అధ్వర్యంలో పత్రికల్లో వార్తలు పాఠకులను ఆకర్శిస్తున్నాయి. ఈపుస్తకావిష్కరణలో నంద్యాల బ్యూరో ఇంచార్జ్ సుబ్బరాయుడు, రిపోర్టర్ ఎస్ జయప్రకాష్ (విద్య), కనకరాజు (క్రైం), గద్దం సుబ్బరాయుడు (హాస్పటల్), మరియదాసు (టెక్కె)లు పాల్గొన్నారు.

## ప్రజల మన్ననలు పొంది జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి

### - ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె, మే29, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని టంగుటూరు గ్రామ శివార్లలో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం నుంచి అప్పలాపురం, కైప గ్రామాల మీదుగా బనగానపల్లె పట్టణంలోని జీఎం టాకీస్, పాతబస్టాండ్ మీదుగా భారీ మోటర్ సైకిళ్ల ర్యాలీని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన తనయుడు, వైసీపీ యువనాయకులు కాటసాని ఓబుళరెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రాజన్న తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ పార్టీని స్థాపించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనమోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నేటికి నాలుగు వసంతాలు పూర్తి చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని టంగుటూరు గ్రామ నుంచి బనగానపల్లె పట్టణంలోని అవుకు మెట్ట వరకు భారీ మోటర్ సైకిళ్ల ర్యాలీని నిర్వహించి అవుకుమెట్ట వద్ద ఉన్న దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇచ్చి నేటికి నాలుగు వసంతాలు పూర్తయిన సందర్బంగా ముఖ్యమంత్రిగా మన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలను పొంది జనరంజక పరిపాలన సాగిస్తున్న సందర్బంగా భారీ మోటర్ సైకిళ్ల ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజల కష్టసుఖాలను 2648కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించి ఆ కష్టసుఖాల నుంచి నవరత్నాలు అనే పథకాలు తీసుకువచ్చి అధికారం చేపట్టిన తరువాత ఆ నవరత్నాల పథకాలను అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అలాంటి ముఖ్యమంత్రి ప్రజలకు పరిపాలన సాగిస్తుంటే ఎక్కడ తమ తెలుగుదేశం పార్టీ ఉనికి కోల్పోతుందోనని చంద్రబాబు నాయుడు తన ముద్దుల గారాలపట్టీ నారా లోకేశ్‌ను పాదయాత్ర పేరుతో ఆంధ్రరాష్ట్రమంతా తిప్పడం జరుగుతుందన్నారు. అయితే నారా లోకేశ్ పాదయాత్రలో తమను ప్రజలు గెలిపిస్తే తమ పరిపాలన ఎలా ఉంటుందని ప్రజలకు తెలియజేయాల్సిందిపోయి నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో స్థానిక శాసనసభ్యుల మీద వారికి నిక్‌నేమ్‌లు పెట్టుకుంటూ పోవడం నారా లోకేశ్ ఎంత అవివేకవంతుడని ప్రజలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సభలు నిర్వహించినప్పుడు హుందగా సభలను నిర్వహించాలికాని రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే వాటికి పర్యవసనాలు నారా లోకేశ్ చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. నారా లోకేశ్‌కు నియోజకవర్గాల గురించి ఏమి తెలియకుండానే విమర్శలు చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచతప్పకుండా ఇప్పటికే 99శాతం అమలు చేశారన్నారు. అదే విధంగా బనగానపల్లె నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తొందరలో రింగ్‌రోడ్డు మరియు షాదిఖానా పనులు చేపడతామని ఆయన తెలియజేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎం టాకీస్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందని తెలిపారు. అదే విధంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా చేసి మండల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం జరుగుతుందని త్వరలోనే ఈ ప్రభుత్వాసుపత్రిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నియోజకవర్గ వైసీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, నంద్యాల జిల్లా వైసీపీ యువజన సంఘం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, వైసీపీ మైనార్టీ నాయకులు అత్తార్ జాహీద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, రైతు విభాగం అధ్యక్షులు జిల్లెల్ల శివరామిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, కాటసాని అభిమానులు, కాటసాని ఓబుళరెడ్డి యూత్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్



**కర్నూలు క్రైమ్, మే, 29, ప్రభాతవార్త :-** కర్నూలు జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా బాధ్యతలు చేపట్టి జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ను మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి కలిసిన అడిషనల్ ఎస్పి టి.సర్కార్ స్వస్థలం అనంతపురం జిల్లా కదిరి టౌన్ ఆయన 1989లో ఎస్ ఐ హోదాలో పోలీస్ శాఖలో చేరారు. ఆళ్ళగడ్డలో ప్రోపేషనరీ ఎస్సైగా బేతం చేర్లలో ఎస్సైగా పని చేశారు. 11 సంవత్సరాలు హైదరాబాదదులో పని చేశారు. 2002లో సీఐగా పదోన్నతి పొందారు. సిఐగా మదనపల్లె రూరల్ మదనపల్లె అర్బన్ మొలకలచెరువు తిరుపతి ట్రాన్స్ కో లో పనిచేశారు. 2011 లో డిఎస్పీగా పదోన్నతి పొందారు. డీఎస్పీగా పిటిసి తిరుపతి ఒక సంవత్సరం ఫారిన్ సర్వీస్ 14వ బెటాలియన్ లో పని చేశారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత ట్రాఫిక్ డిసిపి గా విజయవాడలో ని చేశారు. అక్కడి నుండి బదిలీ పై కర్నూలు జిల్లాకువచ్చారు. బాధ్యతలు చేపట్టిన అడిషనల్ ఎస్పీని డిపిఓ ఎఓ సురేష్ బాబు డిపిఓ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

## పిడుగుపాటుకు గురై బాలుడు మృతి

### - శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
### - కొత్త బస్టాండు సెంటర్‌లో కుటుంబ సభ్యుల ధర్నా
### - దాదాపు రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం



**గడివేముల, మే29, ప్రభాతవార్త ;** గడివేములలోని స్థానిక ఎరుకల కాలనీకి చెందిన ఎరుకలి సుంకన్న కుమారుడు అనిరుధ్(05) సోమవారం నాడు సాయంత్ర సమయంలో పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అలాగే బాలుడి తల్లికి కొద్దిపాటి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. బాలుడి మృతితో కటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పిడుగుపాటుకు గురై మృతిచెందిన బాలుడి మృతదేహాన్ని బాలుడి కుటుంబ సభ్యులు కొత్త బస్టాండు సెంటర్‌లో ఉంచి ధర్నా నిర్వహించారు. నిరుపేదలైన గిరిజన ఎరుకలి తెగకు చెందిన తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇంటి స్థలాలు మంజూరు చేయలేదని, ల్లు నిర్మించి ఇవ్వలేదని, దాదాపుగా 20 సంవత్సరాల నుంచి తాము వేసుకున్న గుడిసెలు ఇటీవల మూడు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీనివాసులు ప్రభుత్వ స్థలాలను ఖాళి చేయాలని సర్వే నిర్వహించి ఇంటి స్థలాలను ఇస్తామని చెప్పి ఖాళీ చేయించారన్నారు. ఆరుబయట నివాసం ఉండడంతో సోమవారం తమకు గుడిసెలు లేనందు వల్ల తమ బాలుడిని కోల్పోవాల్సి వచ్చిందని, అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ కొత్త బస్టాండు కూడలిలో ధర్నా నిర్వహించారు. దాదాపు రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

## వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ వారధులు

### - సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు
### - ప్రజల ముంగిట వద్దకే పథకాలు
### - ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు
### - ప్రభుత్వ ప్రతినిధులుగా పనిచేస్తున్న వలంటీర్లను గౌరవించుకోవాలి

**బనగానపల్లె, మే29, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక పొదుపు భవనంలో మండల అభివృద్ధి అధికారి ఏ.శివరామయ్య ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు హాజరై సేవరత్న, సేవమిత్ర, సేవవజ్ర అవార్డులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు ప్రదానం చేసి వారికి శాలువకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించే వారధులు వలంటీర్లేనని వారి సేవలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలియజేశారు. ప్రతినెల 1వ తేదిన వేకువజామునే పింఛన్లు పంపిణీ చేసే విషయంలో దేశంలోనే ఎక్కడాలేని విధంగా వలంటీర్లు అందించడం వారి సేవలను అభినందించాలని తెలిపారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంలో వారి కృషి ఎనలేనిదని తెలియజేశారు. జగనన్న తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఏకంగా 2.5లక్షలకు పైగా వలంటీర్లు, 1.5లక్షలకు పైగా సచివాలయ ఉద్యోగులు మొత్తం 4లక్షల మంది ఈ వ్యవస్థ కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు నిరంతరం ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా సచివాలయ వ్యవస్థ పనిచేయడం జరుగుతుందని తెలిపారు. జగనన్న తీసుకువచ్చిన పరిపాలన సంస్కరణలో వలంటీర్ల వ్యవస్థ గొప్ప వ్యవస్థ అని తెలిపారు. ప్రభుత్వం సేవమిత్ర, సేవరత్న, సేవవజ్ర అవార్డులు ఇచ్చి సత్కరిస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మానసవీణ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, యాగంటిపల్లె బండి బ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, వైసీపీ మైనార్టీ నాయకుడు అబ్దుల్ ఫైజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చెత్తచెదారం చేరి ధుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీ



**నందికొట్కూరు, మే 29, ప్రభాతవార్త:** పట్టణంలోని కుమ్మరివీధిలో డ్రైనేజీలలో చెత్తచెదారం చేరి ధుర్గంధభరితంగా మారింది. దీనిపై మున్సిపాల్టి అధికారులకు తెలిపిన ఇంత వరకు చర్యలు చేపట్టక పోవడంతో దోమలు, వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీ 2, 24 వార్డులలోకి వస్తుందని దీంతో వారు చేస్తారని వీరు వీరు చేస్తారని వారు పట్టించుకోవడం లేదని ఇప్పటికైన శానిటరీ అధికారులు స్పంధించి తగు చర్యలు తీసుకోవాలని స్తానికులు కోరారు.

## బోల్తాపడిన మామిడి పండ్ల టెంపో

### -తృటిలో తప్పిన ప్రమాదం



**మంత్రాలయం, మే 29, ప్రభాతవార్త:** నియోజ కవర్గకేంద్రమైన మంత్రాలయం పోలిస్ స్టేషన్ పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఓటెంపో బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఇద్దరు వ్యక్తులకు ప్రాణాపాయం తప్పిం ది. వివరాల మేరకు కడప జిల్లా పులివెందుల పట్టణం నుండి కర్ణాటక రాష్ట్రంష హపూర్ పట్టణానికి మామిడి పండ్లను ఓ టెంపోలో తీసుకొని వెళుతుండగా అర్ధ రాత్రి సమయంలో కల్లుదేవకుంట గ్రామ సమీపంలో ఉంచిన డ్రమ్ములనుఢీకొట్టి రోడ్డు పక్కనున్న డ్రైనేజీ గుంతలో టెంపో బోల్తా పడిపోయింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డారు.

## లబ్ధిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**నందికొట్కూరు, మే 29, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. సోమవారం మత్స్యశాఖ నుండి మంజూరు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.21.62 లక్షల విలువ గల లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి ధృవపత్రాలను, వాహన తాళాలను అందజేశారు. జనరల్ కేటగిరిలో రూ.8లక్షల సబ్సిడితో శ్రీనువాసులుకు ఇవ్వడం జరిగిందని మత్స్య అభివృద్ధి అధికారి భరత్‌లాల్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దు అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉశేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, సహాయకులు చంద్రమోహన్, ఆనంద్, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## బనగానపల్లె మాజీ ఉపసర్పంచ్ భార్య మృతి

### - నివాళులర్పించిన మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



**బనగానపల్లెరూరల్, మే29, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని పాత రైస్‌మిల్ వెనుక నివాసముంటున్న బనగానపల్లె మాజీ ఉపసర్పంచ్ సజ్జాద్ భార్య నూర్జహాన్(57)ఆదివారం సాయంకాలం మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సోమవారం ఉదయం సజ్జాద్ నివాసానికి వెళ్లి నూర్జహాన్ భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ తాను బనగానపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసే సమయంలో సజ్జాద్ ఉపసర్పంచ్‌గా పనిచేశారని అప్పటి నుండి ఆ కుటుంబంతో మంచి స్నేహసంబంధాలు ఉన్నాయని నూర్జహాన్ అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందడం చాలా బాధాకరమని, అలాగే వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని బీసీ రాజారెడ్డి మనోధైర్యం కల్పించారు. బీసీ రాజారెడ్డి వెంట వెల్‌కల్ ఫోటోస్టూడియో అల్తాఫ్ తదితరులు ఉన్నారు.

## పేద ప్రజలను మోసం చేసేందుకు బాబు మేనిఫెస్టో.....

### - బాబును ప్రజలు నమ్మేస్థితిలో లేరు
### - ఇచ్చిన వాగ్ధానాలను వంద శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే....
### - ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



**ఆదోనిటౌన్, మే29, ప్రభాతవార్త ;** పేద ప్రజలను మోసం చేసే విధంగా మేనిఫెస్టోను మాజీ సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేశారని, దీనిని ఎవరూ నమ్మవద్దని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనర్రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా ఆదోని పట్టణంలో ఎమ్మెల్యే అధ్యక్షతన భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్టీఆర్ బతికుండగానే వెన్నుపోటు పొడిచిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నేడు అధికారంలోకి వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఎవరూ బాబును నమ్మే స్థితిలో లేరన్నారు. 2014 ఎన్నికల్లో కూడా అమలుకు సాధ్యం కాని 700 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసి ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. దీంతో ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించారన్నారు. బాబు మాటలను ప్రజలు నమ్మే సితిలో లేరని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలోని అన్ని వాగ్ధానాలను తూ.చ. తప్పకుండా అమలుపరిచిన ఘనత వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్య పడిందన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో మరోసారి ప్రజల మద్దతుతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యువనేత జయమనోజ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ వైఎస్సార్సీపీ గౌరవాధ్యక్షులు చంద్రకాంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయశాంత, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాసు, వైస్ చైర్మన్ నరసింహులు, వైఎస్సార్సీపీ కౌన్సిలర్ లు రఘునాథరెడ్డి, ఫయాజ్ అహ్మద్, రాజేశ్వరరెడ్డి, బోలాజీ, చవలపతి, చిన్న, మల్లికార్జున, మధుబాబు, రహమాన్, మాధవరెడ్డి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.